# - చుట్టాలొస్తున్నారు జాగ్రత్త! -

రచయిత్రి: శాంతకుమారి

ట్రిక్కటక మని తలుపు చప్పుడవుతుంది.

కామాక్షీ! కామాక్షీ! తలుపుతీయి, ఆఁ వస్తున్నానండి. మీకు మరీ తొందర. ఎవరైనా ఆగుతారుకాని మీకు మాత్రం ఆగరు అంటూ తలుపు తీసింది కామాక్షి. మీ అక్కయ్యవాళ్ళొచ్చారు.

ఏమిటి అక్కయ్య వచ్చిందా? ఏం అక్కయ్యా కులాసాగా ఉన్నావా? బావ కులాసాగా ఉన్నారా? అంటూ ఇంటికి వచ్చిన చుట్టాన్ని పలకరించాడు వెంకట్రావు లేని నవ్వు తెచ్చుకుంటూ!

ఆఁ బాగున్నాను తమ్ముడూ! ఏమిటో ఈ మధ్య నా ఒంట్లో బాగులేదు. మీ బావకి ఆఫీసు సెలవు లేదు, పిల్లలతో చాకిరీ చెయ్యలేకపోతున్నాను, నాకా నువ్వు ఒక్కడివే తమ్ముడివి, ఏదో నాలుగురోజులుండి పోదామని వచ్చాను అంటూ ముగించింది జానకి.

కామాక్షీ కాఫీ పట్టుకొనిరా! ఇంటికి మగాడొస్తే కాఫీ నీళ్ళకైన గతిలేదు, ఏం కాపో ఒక నిమిషం ఇల్లు ఖాళీ ఉండదు, ఎప్పుడూ ఇంటిలో చుట్టాలే, వీళ్ళంతా నా ప్రాణాల మీదికే అంటూ విసుక్కున్నాడు వెంకట్రావు.

ఇదిగో కాఫీ! తీసుకోండి. అబ్బ అస్తమానూ అలాగ చిరాకుపడతా రెందుకు, ఏదో వచ్చారు, నాలుగు రోజులు ఉండి పోతారు, దానికోసం మీ రెందుకు చిరుబుర్రులాడి చెడ్డ అనిపించుకోవడం.

అదికాదు కామాక్షీ! పెళ్ళయింది మొదలు! మనం వేరే కాపురం పెట్టినా! ఎంతో దూరపు దేశాలకు వెళ్ళినా వీళ్ళు వస్తున్నారు, నేను డబ్బు పెట్టడం, నువ్వు పనులతో సతమతమవడం, ఏదో ఒక సారి బాధకొద్ది అనుకోవడం అంటూ పేపరు తీసుకొని వాలుకుర్చీలో చేరబడ్డాడు.

ఏమండీ. ఏమండీ లేచి కాస్త మిల్కు బూత్ కెళ్ళి పాలు తెస్తారా! కాఫీలు కలపాలి, ఈరోజు మీ అక్కయ్య ఊరు కెళ్ళిపోతారట, లేవండి, లేవండి అంటూ వంటింట్లికి వెళ్ళిపోయింది కామాక్షి.

అబ్బబ్బ! వెధవ వూరు, పాలకి మనమే వెళ్ళాలి, చాకలి పనికి మనమే వెళ్ళాలి. విసుక్కుంటూ పాలసీసా పట్టుకొని వీధిలోకి నడిచాడు.

ఇదిగో పాలు, కాఫీ త్వరగా కలిపిపట్టుకురా. అంటూ బ్రష్ నోటిలో పెట్టుకుని పెరట్లోకి వెళ్ళాడు.

ఒరే! తమ్ముడూ వెళ్ళిపోతున్నానురా, బట్టలన్నీ సర్దేసుకున్నాను, ఆఁ వెళ్ళు, రిక్షా పిలవనా అన్నాడు. అదేమిటండీ రాక రాక వచ్చారు, వెళ్ళిపోమని చెప్తున్నారు, మాట వరసకు అయినా ఉండమనండి. పోతేపోనిద్దూ గొడవ తగ్గుతుంది, వేలు చూపిస్తే మండ మింగే రకం, దాని సంగతి నీకు తెలీదు. మాట వరసకు అన్నామనుకో, ఇంక ఈ ఇంటిలోంచి కదలకుండా కూర్చుంటుంది.

తమ్ముడూ, కామాక్షీ వెళ్ళొస్తాను. అయినా

మరీ ఇంత చిన్న ఇల్లు తీసుకున్నారు ఏమిటి? ఈ పట్టణంలో ఇళ్ళేలేవా? అంటూ రిక్షా ఎక్కింది జానికి.

రిక్షా కదలగానే హమ్మయ్యా, ఇప్పటికి కదిలింది, ఏం తక్కువ రోజులు లేదు పది రోజులుంది. ఇల్లు చిన్నదట. నాలాంటివాళ్ళుండానికి ఇది చాల్లే. ఓ! కామాక్షి తలుపేసుకో ఆఫీసుకి వెళ్ళుతున్నాను అని వీధిలోకి వెళ్ళిపోయాడు వెంకట్రావు.

ఆరోజురాత్రి హాయిగా భోంచేసి డాబా మీద మంచంవేసుకొని పడుకున్నాడు. చల్లని గాలి వేస్తోంది. వెన్నెల పిండారబోసినట్లు కాస్తోంది. అలాగే మంచంమీద పడుకొన్న వెంకట్రావుకి గతం గుర్తు కావస్తోంది. ఇవాళ ఎవరూ లేదు. కామాక్షి పనులు చేసుకుంటూంది. ఒంటిరిగా ఆలోచిస్తున్నాడు. అవును, తనకి చిన్నప్పట్నించి ఒక్కటే, ఒంటరిగా ఉండడమంటే ఎంతో ఇష్టం. ఒకడు మనింటికి రాకూడదు. మనం వాళ్ళింటికి వెళ్ళకూడదు. ఎందుకో నాకు డబ్బు ఖర్చుపెట్టాలనుండదు. నాకు తగ్గట్టు నా భార్యకూడా అలాటిదే. మేం అందరం కలిసి ఉన్నప్పుడుకూడా, ఒక్క కానీ ఎవరికీ ఇవ్వలేదు. అందుకే నా తత్వం చిన్నప్పటినుండి ఒక్కటే. ఒకరు వస్తేచిరాకు. ఎవ్వరూ రాకుండా నేను, నా భార్య ఉంటే ఎంత హాయిగా ఉంటుంది. అని చిన్నగా నవ్వుకొంటూ నిద్రలోకి జారుకున్నాడు.

ఆ మరునాడు ఆఫీసునుండి హుషారుగా ఈల వేసుకుంటూ వస్తూన్న వెంకట్రావుని చూచి, ఏమండీ మనింటికి మీ అమ్మ మేనమామ కూతురు అల్లుడుట, పాపం పిల్లా పాపతో మొత్తం పది మంది వచ్చారు అంది నవ్వుతూ కామాక్షి.

ఏం! నన్ను చూస్తే వేళాకోళంగా ఉందా? సినిమాకు పోదాం తయారవు. అదికాదండి నిజంగానే వచ్చారు. అదిగో ఆ గదిలో ఉన్నారు. వెంకట్రావు అక్కడికి పోయి సభ్యత కోసం వాళ్ళని పలికరించాడు. అయ్యో ఈ రోజు సినిమాకువెళ్దాం అనుకున్నాం, వీళ్ళెక్కడ దాపురించారురా నాయనా! ఇంకా ఎన్నాళ్ళు తిష్ఠ లేస్తారోఅని మనసులో గొణుక్కుంటూ తన గదిలోకి నడిచేడు. ఆ వచ్చినవాళ్ళు అన్నయ్యా మమ్మల్ని సినిమాకు తీసుకెళ్ళరు? మా ఊళ్లో సినిమాలు ఉండవు అన్నారు. వాళ్ళందరికి సినిమాకు టిక్కట్లు నన్నే కొనమన్నారు. మరేం చేస్తాం పదండి పదండి ఈ ఊపుతోనైన సినిమాకువెళ్ళడం అవుతుంది అని అందర్నీ పదమన్నాను.

'నేను రాను ఇక్కడ వంటలు చేయాలి మీరు పోయిరండి అంటూ పనిలోకి తల దూర్చింది కామాక్షి.

(సశేషం)



Edited and Published by A. N. Raghavachar, No. 6-B, Murugesamudali Street, Madras-600001.
Printed by G. Kulasekaram at Giridhar art Printers, 17 & 19, Badrian Street Madras-600001.